సాక్షి నంద్యాల

మంగళవారం । 10 । జూన్ । 2025



విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయ'ం

బనవాసి నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష ప్రకటన విడుదలైంది.

8లో▸



మేమింతే!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులను అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ భూమి పూజ చేస్తున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,602.15
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:24.292
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,653
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:213

న్యూస్‌రీల్

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 835.40 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం సోమవారం సాయంత్రం సమయానికి 835.40 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 55.5655 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయానికి సుంకేసుల ప్రాజెక్ట్ నుంచి 1,585 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఎడమగట్టు కేంద్రంలో 0.613 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 1,308 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యాం పరిసర ప్రాంతాలలో 22.80 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పాలిష్ ఫ్యాక్టరీలకు నీటి సమస్య



మూత పడిన పాలిష్ ఫ్యాక్టరీ

కొలిమిగుండ్ల: భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగు, సాగు నీటికే కాదు పరిశ్రమల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో బోర్లలో నీళ్లు పూర్తిగా ఇంకిపోవడంతో పాలిష్ ఫ్యాక్టరీలకు నీటి సమస్య ఎదురవుతోంది. తుమ్మలపెంట క్రాస్ రోడ్డులోని సాయిబాబా ఆలయం ఎదురుగా అంకిరెడ్డిపల్లెకు చెందిన యజమానులు పాలిష్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసుకున్నారు. కొద్ది రోజుల నుంచి బోర్లలో నీళ్లు రాక పోవడంతో ఇప్పటికే మూడు ఫ్యాక్టరీలు నిలిచిపోయాయి. సమీపంలోని ఫ్యాక్టరీల నుంచి నీటిని వాడుకోవడం, ట్యాంకర్ల ద్వారా తొట్టిల్లో నింపుకున్నారు. అయినా ఇబ్బందిగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు మూత వేయాల్సి వచ్చిందని యజమానులు పేర్కొన్నారు. దీంతో యజమానులతో పాటు కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భూగర్భ జలాల సమస్య తోడు కావడంతో యజమానులు దిక్కుతోచనిస్థితిలో పడుతున్నారు. భారీ వర్షపాతం నమోదు కాకపోతే మిగిలిన ఫ్యాక్టరీల్లో బోర్లు అడుగంటే ప్రమాదం ఉండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్, అధికారులు

నంద్యాల(అర్బన్): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం ఏఎస్ఆర్ కల్యాణ మండలంలో షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుల పురస్కారం-2025 అందజేశారు. 35 మంది ఇంటర్, 182 మంది పది విద్యార్థులకు పతకం, రూ.20 వేల నగదు బహుమతితో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్య అభివృద్ధి వైపు కూడా దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్లేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అందుకు తగ్గ కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అన్ని విధాలుగా ఉత్సాహపరుస్తూ ఏ ఒక్క పరీక్షలో తప్పినా వారిని నిరుత్సాహపరచకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ప్రేమాంత్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మూల పెద్దమ్మా.. చల్లగా చూడమ్మా!



డబ్ల్యూ గోవిందిన్నెలో మూల పెద్దమ్మ దేవర సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజు సోమవారం అమ్మవారికి భక్తులు గండాదీపాలు మోసి నైవేద్యం సమర్పించి పెద్దమ్మా.. చల్లగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన దేవర పూజలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. బంధు,మిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

– దొర్నిపాడు



పెద్దమ్మ ఆలయం వద్ద అశేష భక్తజనం, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

కోవెలకుంట్ల మండలం వెలగటూరు సమీపంలో సాగైన మొక్కజొన్న



ఖరీఫ్.. సాగనంటోంది..!

- సీజన్ ప్రారంభమయ్యాక ముఖం చాటేసిన వరణుడు
- మొక్కజొన్న, పత్తి సాగుకు బ్రేక్
- జిల్లాలో 2.37 లక్షల హెక్టార్లలో సాగు లక్ష్యం
- సాగునీటి కోసం భగీరథ ప్రయత్నం
- రైతులకందని సబ్సిడీ విత్తనాలు
- ఆందోళనలో రైతులు

కోవెలకుంట్ల: మట్టిని నమ్ముకున్న అన్నదాత వ్యవసాయంలో లాభాలు ఆర్జించాలంటే ప్రభుత్వ చేయూతతో పాటు ప్రకృతి కరుణించాల్సిందే. గత వ్యవసాయ సీజన్‌లో నష్టపోయిన రైతు మళ్లీ కోటి ఆశలతో ఈ ఏడాది ఖరీఫ్‌కు సిద్ధం కాకా వరుణుడు మొహం చాటేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్ ప్రారంభమై పది రోజులు కావస్తున్నా వాన జాడ లేకపోవడంతో విత్తన సాగు డీలా పడింది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,37,863 హెక్టార్లలో వరి, పత్తి, మినుము, కంది, మొక్కజొన్న, ఆముదం, వేరుశనగ, సోయాచిక్కుడు, ఉల్లి, కొర్ర, బెండ, తదితర పంటల సాగు చేయాల్సి ఉంది. అయితే ముందస్తు వర్షాలు ఆశలు రేకెత్తించగా ఆయా పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు, రసాయన ఎరువులు సమకూర్చుకున్నారు. తీరా విత్తన సమయంలో వరణుడు ముఖం చాటేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 65,255 హెక్టార్లలో వరి, 50,515 హెక్టార్లలో మొక్కజొన్న, 36,243 హెక్టార్లలో కంది, 18,827 హెక్టార్లలో పత్తి, 12, 715 హెక్టార్లలో మిరప, 11,993 హెక్టార్లలో వేరుశనగ, 9,451 హెక్టార్లలో మినుము, 4,240 హెక్టార్లలో ఉల్లి, 4,176 హెక్టార్లలో సోయాచిక్కుడు, 3,699 హెక్టార్లలో బెండ, 2,921 హెక్టార్లలో ఆముదం, 1,858 హెక్టార్లలో కొర్ర పంటల సాగు సాధారణ విస్తీర్ణం. ఆయా పంటల సాగుకు జూన్ మొదటి వారం నుంచి అదను కావడంతో రైతులు విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు. పది రోజుల నుంచి వాతావరణం మేఘావృతమై వర్షం జల్లులకే పరిమితం కావడంతో ఖరీఫ్ సాగనంటోంది. సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు విత్తనానికి ముందు పొలాన్ని తడుపుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కోవెలకుంట్లకు చెందిన రాముడు అనే రైతు ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కసాగు సాగు చేసేందుకు విత్తనాలను సిద్ధం చేసుకున్నాడు. వర్షం పడకపోవడంతో పొలానికి దాదాపు రెండు కిమీ దూరంలో పట్టణ శివారులోని గుంజలపాడు రహదారిలో రైల్వేలైన్ కోసం తీసిన గుంతల్లో నీరు నిల్వ చేరడంతో ఆయిల్ ఇంజిన్ ద్వారా నీటిని ఎస్సార్బీసీలోకి మళ్లించాడు. పొలం సమీపంలో కాల్వకు అడ్డుకట్ట వేసి అక్కడ మరో ఆయిల్ ఇంజిన్ అమర్చుకుని పైపులద్వారా పొలానికి సాగునీటిని మళ్లించి ఇటీవల మొక్కజొన్న విత్తనం వేశాడు. ఈ రైతుతోపాటు జిల్లాలోని సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు బోర్లు, బావులు, కుంటలు, కుందూనది, పాలేరు, కుందరవాగుల నుంచి పొలాలాలకు సాగునీటిని మళ్లించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. పైపులు, డీజిల్, ఇంజిన్, తదితర ఖర్చుల రూపంలో ఎకరాకు రూ. 10 వేలు భారపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం వేసుకునేందుకు కష్టాలు పడాల్సి వస్తోందని విత్తనం మొలిచాక పైరు వివిధ దశల్లో ఎలా కాపాడుకోవాలని వాపోతున్నారు.

విత్తన పనులు మందగనం..

జిల్లాలో ఖరీఫ్ సాగు డీలా పడింది. విత్తన సమయంలో వర్షాలు పడక, ప్రభుత్వం నుంచి సకాలంలో విత్తనాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సీజన్ ప్రారంభంలోనే జీలుగ, పిల్లిపెసర, మినుము, కందులు, వేరుశనగ, తదితర విత్తనాలను రైతులకు సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో ఇప్పటి వరకు కేవలం జీలుగ విత్తనాలను మాత్రమే రైతులకు సరఫరా చేస్తోంది. సీజన్‌కు ఒక రోజు ముందు కొన్ని పంటల విత్తన ధరలను ఖరారు చేస్తూ జిల్లాకు 892 క్వింటాళ్ల కందులు, 25 క్వింటాళ్ల మినుములు, పది క్వింటాళ్ల పెసర, 70 క్వింటాళ్ల కొర్ర, 154 క్వింటాళ్ల దయాంచా విత్తనాలను మాత్రమే మంజూరు చేసింది. ఆయా పంటలకు సంబంధించి వేలాది ఎకరాల్లో పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా అతి తక్కువ క్వింటాళ్ల విత్తన కేటాయింపులు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటికే వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, కంది, మినుము, తదితర పంటలు సాగు కావాల్సి ఉండగా సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో అరకొరగా పంటలు సాగయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో వర్షాలు పడక, సాగునీటి వసతి అందుబాటులేక పత్తి, మొక్కజొన్న పంటల సాగుకు బ్రేక్ పడింది.

జిల్లాలో వర్షపాతం వివరాలు

సాధారణ వర్షపాతం:	79.6 మి.మీ
9వ తేదీ వరకు నమోదు కావాల్సినది:	17.6 మి.మీ
ఇప్పటి వరకు నమోదైనది:	6.5 మి.మీ

వర్షం కోసం నిరీక్షణ



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసేందుకు పొలాను దుక్కిదున్ని విత్తనానికి సిద్ధంగా ఉంచుకున్నాను. మే నెలలో వర్షాలు విస్తారంగా కురిశాయి. జూన్ ప్రారంభం నుంచి చిన్న పాటి జల్లులు తప్పా పదునయ్యే వర్షం పడలేదు. మొక్కజొన్న, మినుము, కంది పంటల సాగుకు సరైన అదును. పది రోజుల నుంచి వర్షం కురుస్తుందని ఎదురుచూస్తున్నాము.

– రాజేష్, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి



ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలు, రసాయన ఎరువులు సరఫరా చేయాలి. కంది, మినుము, వేరుశనగ, పెసర, కొర్ర విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందజేయాలి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం కావడంతో విత్తనానికి సమాయత్తమవుతున్నాం. ఆయా పంటల సాగుకు జూన్ నెలాఖరు వరకు సరైన అదును. ఆ లోగా రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేసి ఆదుకోవాలి.

– జగన్‌మోహన్‌రెడ్డి, రైతు, కోవెలకుంట్ల

ఏడాది వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్

- సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



కర్నూలు (టౌన్): చంద్రబాబు తన ఏడాది వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీన జరిగిన సాక్షి చానల్ చర్చా వేదికలో సీనియర్ జర్నలిస్టు కృష్ణం రాజు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆపాదించే కుట్ర పన్నడం ఎంత వరకు సమంజసమన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ సోషల్ మీడియాలో వైరల్ చేయడం, మంత్రి లోకేష్ ప్రోద్బలంతో అమరావతిలో ప్రదర్శనలు, సాక్షి కార్యాలయాలపై దాడులు, వైఎస్ జగన్ కుటుంబంపై అసభ్య వ్యాఖ్యలు చేయడం ఒక పథకం ప్రకారం చేస్తున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఏడాది పాలనలో చంద్రబాబు అన్ని రంగాల్లో విఫలం చెందారన్నారు. ఇటీవల అనంతపురంలో టీడీపీ కార్యకర్తల గ్యాంగ్ రేప్, ఇంటర్మీడియెట్ గిరిజన విద్యార్థిని దారుణ హత్య ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఇలాంటి దారుణాలు రాష్ట్రంలో తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. అసమర్థ పాలన బయటపడకుండా ప్రజలను డైవర్ట్ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు చేతకాక రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుల మీద కేసులు పెట్టి నోరు మూయాలనుకోవడం కన్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు.

ఉడుములపాడు చెరువులో మట్టి దొంగలు



చెరువు గట్టుపై అక్రమంగా మట్టిని తవ్వుతున్న దృశ్యం

- యథేచ్ఛగా టీడీపీ నేతల అక్రమ తవ్వకాలు
- ఇటుక బట్టీలకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న పోలీసు, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు



నీటి పరివాహక ప్రాంతంలో మట్టి తవ్వకాలు

డోన్: కూటమి నేతల అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. యథేచ్ఛగా ఇసుక, మట్టి, మద్యం, రేషన్.. ఇలా అక్రమ వ్యాపారాలు చేస్తున్నా అడ్డుకునేవారు లేరు. మండలంలోని ఉడుములపాడు చెరువు నీటి పరివాహక ప్రాంతంలో టీడీపీ నేతలు మట్టిని అక్రమంగా తవ్వి ఇటుకల బట్టీలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. డోన్‌లోని కొండపేటకు చెందిన ఓ టీడీపీ నేత కనుసన్నల్లోనే మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెరువు కట్టలను ఆధునికీకరించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నేతలు చెరువులను కొల్లగొడుతున్నారు. మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తూ ట్రాక్టర్ రూ.1500 నుంచి రూ.2 వేలకు ఇటుక బట్టీలకు విక్రయించి సొమ్ము చేసుకంటున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి ప్రకృతి వనరులు కరిగిపోతున్నా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూరల్ పోలీసుస్టేషన్ ఎదురుగానే చెరువు మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువు పరివాహక ప్రాంతంలో అడ్డదిండగా తవ్వకాలు చేపడుతుండటంతో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఉడుములపాడు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ గుంతల్లో పడి ఒక బాలుడు మృతి చెందినట్లు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి టీడీపీ నాయకుల అక్రమ మట్టి తవ్వకం, తరలింపును అరికట్టాలని కోరుతున్నారు.

టీడీపీ దాడులకు ఉసిగొల్పుతోంది



కర్నూలు యూనిట్ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

'సాక్షి' కార్యాలయాలకు రక్షణ కల్పించండి

- కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస ఆచారికి వినతి
- సాక్షి యూనిట్ కార్యాలయం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): ఉద్దేశ పూర్వకంగా సాక్షి మీడియా గ్రూపు కార్యాలయాలపై దాడులు చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి రక్షణ కల్పించాలని కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస ఆచారికి సాక్షి సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్‌లు రవికుమార్, లోకేష్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అంశంపై ఇటీవల సాక్షి చానెల్‌లో ఓ పాత్రికేయుడు వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని సాక్షి సమర్థించడంలేదని, ఆయన అభిప్రాయంతో తమ సంస్థ ఏకీభవించడం లేదన్నారు. ఇది పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావుతోపాటు అభిప్రాయం వ్యక్తం చేసిన పాత్రికేయుడు సైతం ఈ అంశంపై విచారం వ్యక్తం చేశారన్నారు. ఈ వ్యవహారంతో సాక్షి గ్రూపునకు ఎలాంటి ప్రమేయం లేనప్పటికీ తెలుగుదేశం పార్టీ అధిష్టానం కుట్రపూరితంగా తన శ్రేణులను రెచ్చగొట్టి సాక్షి కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పుతోందన్నారు. ఇది పూర్తిగా ఆర్గనైజ్‌డ్ క్రైం కిందకు వస్తున్న నేపథ్యంలో తమ కార్యాలయాలకు రక్షణ కల్పించాలని వారు డీఎస్పీని కోరారు.

కొవ్వొత్తుల ప్రదర్శన: సాక్షి కార్యాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ లక్ష్మీపురంలో ఉన్న సాక్షి యూనిట్ కార్యాలయ సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అన్ని విభాగాల సిబ్బంది కొవ్వొత్తులను వెలిగించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు మంచిది కాదని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా మురళీమోహన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎస్.మురళీమోహన్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం ధవళేశ్వరం పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనను ఖాళీగా ఉన్న నంద్యాల జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులో నియమిస్తూ ఆర్థిక శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ రోనాల్ట్‌రోజ్ జీవో ఆర్‌టీ నంబరు 1923 జారీ చేశారు. ఇంతవరకు కర్నూలు జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వామిశేఖర్ నంద్యాల జిల్లాకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

అర్జీలు నాణ్యతతో పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యలు నాణ్యతతో, వేగవంతంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న 1741 దరఖాస్తులను, రీ ఓపెన్ అయిన 59 దరఖాస్తులను వెంటనే నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో వంద శాతం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఇప్పటి వరకే యోగాంధ్రలో శిక్షణ ఇస్తున్న వారి వేదిక, రిజిస్ట్రేషన్ పూర్తి కావాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పౌరుల నమోదు శాతం వంద శాతానికి చేరువలో ఉన్నాయని వంద శాతం పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో 205 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్‌కు అందజేశారన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంత పని చేశావు తల్లి!

- 40 రోజుల క్రితం అనారోగ్యంతో భర్త మృతి
- మనోవేదనతో భార్య ఆత్మహత్య
- అనాథలుగా మారిన ఇద్దరు కుమార్తెలు



ఆత్మహత్యకు పాల్పడిన మహేశ్వరమ్మ (ఫైల్)



అనారోగ్యంతో మృతి చెందిన పవన్ కుమార్



అనాథలుగా మారిన చిన్నారులు జాహ్నవి, హర్షిత

చాగలమర్రి: ఇద్దరు చిన్నారులు.. ఒకరికి నాలుగేళ్లు, మరొకరికి ఏడేళ్లు.. తండ్రి అకాల మరణం చెందారు. ఇక పిల్లల భారమంతా ఆ తల్లిదే. కుమార్తెల ఆలనా..పాలనా చూసుకోవాల్సిన ఆమె మనోవేదనతో తీసుకున్న నిర్ణయం ఇద్దరి పిల్లలను అనాథగా మార్చేసింది. భర్త లేని లోకంలో తాను ఉండలేనంటూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మండల కేంద్రం చాగలమర్రిలో చోటు చేసుకుంది. స్థానిక న్యూ బిల్డింగ్స్ కాలనీలోని రోసిరెడ్డి రైస్ మిల్ వీధిలో నివాసం వుంటున్న పవన్ కుమార్(40) నిత్యావసర వస్తువుల ఏజెన్సి నిర్వహిస్తూ 40 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని భార్య మహేశ్వరమ్మ(30) ఇద్దరు కుమార్తెలు జాహ్నవి (7), హర్షిత (4)తో కలసి తండ్రి కృష్ణమూర్తి చెంత ఉంటోంది. కృష్ణమూర్తికి మతిస్థిమితం లేదు. కొన్నాళ్ల క్రితం అతని భార్య కూడా మృతి చెందింది. మరో వైపు పవన్ కుమార్ తల్లిదండ్రులు కూడా మృతి చెందారు. అటు భర్త తరఫు, ఇటు తన తరఫు అండగా నిలవాల్సిన ఎవరూ లేకపోవడంతో భర్త చనిపోయినప్పటి నుంచి మహేశ్వమరమ్మ తీవ్ర ఆందోళన చెందింది. చివరకు మనోవేదనతో ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఓ గదిలోకి వెళ్లి నిప్పంటించుకుంది. ఇంట్లో మంటలు కనిపించడం, పెద్దగా కేకలు రావడంతో ఇరుగు పొరుగున ఉన్నవారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ సురేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంటి లోపల వైపు గడియ పెట్టి ఉండటంతో ఇంటిపై నుంచి పోలీసులు లోపలికి ప్రవేశించి సోఫాలో నిద్రిస్తున్న పిల్లలిద్దరిని, ఆమె తండ్రిని బయటకు తీసుకొచ్చారు. అప్పటికే మహేశ్వరమ్మ పూర్తిగా కాలిపోయి మృతి చెందింది. తల్లి మృతితో రోదిస్తున్న చిన్నారులను చూసి పలువురు కంట తడి పెట్టారు. ప్రస్తుతం దూరపు బంధువు వద్ద ఆ చిన్నారులు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

రైల్వే కాంట్రాక్టర్ దుర్మరణం

బనగానపల్లె: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న పనుల వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన రైల్వే కాంట్రాక్టర్ నిమ్మగడ్డ అజయ్‌బాబు(59) మృతి చెందారు. రైల్వే అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. స్టేషన్ సమీపంలో సిమెంట్ కంకర పనులు జరుగుతున్నాయి. హైజాక్ మిషన్ వాహనం వెనుక వైపున అజయ్‌బాబు నిలబడి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. గుర్తించని వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ ఢీకొని కణితి మృతి



మృతి చెందిన కణితి

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల రైలు మార్గంలో గూడ్సు రైలు ఢీకొని కణితి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. నల్లమలలోని చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న కణితిని గూడ్సు రైలు ఢీకొనడంతో ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న చలమ రేంజ్ అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతి చెందిన కణితికి పశువైద్యాధికారుల చేత పోస్టుమార్టం నిర్వహించి దహనం చేసినట్లు ఎఫ్‌బీఓ మద్దిలేటి స్వామి తెలిపారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

బేతంచెర్ల: అప్పుల బాధతో ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంబాపురం గ్రామానికి చెందిన పాణ్యం వెంకటేశ్వర్లు(33) లారీ డ్రైవర్‌గా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల దాక అప్పు చేశాడు. దీనికి తోడు రెండు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో కాలు విరిగింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు ఈనెల 6వ తేదిన పాణ్యం వెంకటేశ్వర్లు పురుగు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మరణించాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప సోమవారం తెలిపారు.

చోరీకి యత్నం..
గ్రామస్తుల దేహశుద్ధి



దొంగను చెట్టుకు కట్టేసిన గ్రామస్తులు

సంజామల: ఆకుమల్ల గ్రామంలో చోరీకి యత్నించిన ఓ దొంగకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. సోమవారం తెల్లవారు జామున గంగమ్మ గుడి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అక్కడ హుండీ లేకపోవడంతో అనంతరం వెంకటరామిరెడ్డి కాలనీలో ఉదయం వలి అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొడుతుండగా చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేశారు. పారిపోతున్న దొంగను పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. చోరీకి యత్నించిన యువకుడిది జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రుంద్రంగొడుగా విచారణలో తేలినట్లు తెలిసింది.

విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయ'ం

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 29వ తేదీ వరకు గడువు
- కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులకు అవకాశం



బనవాసి నవోదయ విద్యాలయ ప్రాంగణం



తరగతి గదిలో ట్యాబ్‌లతో విద్యా బోధన

దరఖాస్తు ప్రారంభ తేదీ
02-06-2025
దరఖాస్తులకు ఆఖరు తేదీ
29-07-2025
పరీక్ష తేదీ 13-12-2025
సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
08512-246544

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ.. ఉత్తమ విద్యా బోధన అందిస్తూ ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పేరుగాంచింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో దీనిని స్థాపించారు. ఈ విద్యాలయంలో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తున్నారు. నవోదయ విద్యాలయంలో 2026–2027 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన పరీక్ష ప్రకటన విడుదలైంది. జూలై 29వ తేదీ వరకు అన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవచ్చు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులు. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు.

ప్రత్యేకతలు ఇవే..

- సీబీఎస్ఈతో కూడిన అత్యుత్తమ విద్యా బోధన
- ఆధునాత కంప్యూటర్ ల్యాబ్
- పోషక విలువలతో కూడిన ఆహారం
- మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు
- విశాలమైన గ్రంథాలయం.

అత్యుత్తమ విద్యాప్రమాణాలు

విద్యాలయంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల సర్వోతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణలతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రీషియన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో చాలమంది ఉన్నారు.

– ఇ.పద్మావతి, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

జర్నలిస్టు చట్టాలను పునరుద్ధరించాలి



కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

- కలెక్టరేట్ ఎదుట ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టు చట్టాలను పునరుద్ధరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నగర కమిటీ అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర రద్దుచేసిన 44 కార్మిక చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. నిత్యం జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు అరికట్టాలని, ఇందుకు రక్షణ చట్టం తేవాలన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. జర్నలిస్టులకు సరైన వేతనాలు ఇచ్చేలా చట్టం చేయాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేబీ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు హుస్సేన్, వీడియో జర్నలిస్టు రాష్ట్ర నాయకులు హుస్సేన్, జిల్లా నాయకులు సునీల్‌కుమార్, నగర కార్యదర్శి ఎర్రమల పాల్గొన్నారు.

మేమింతే!



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం



శంకుస్థాపన పేరుతో తాజా శిలాఫలకాలు

మహానంది: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులను అప్పటి ప్రజా ప్రతినిధులు భూమి చేసి ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే ఆ పనులు చేసి ప్రారంభించాలి. ఇక్కడ కూటమి నేతలు అదే పనులకు మళ్లీ భూమి చేయడం పరిపాటిగా మారింది. ఇందుకు మహానంది క్షేత్రంలో జరిగిన కార్యక్రమమే నిదర్శనం. మహానంది దేవస్థానంలో రూ. 10.50 కోట్లతో 55 వసతి గృహాల నిర్మాణానికి 2024 ఫిబ్రవరి 14న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన, భూమిపూజ చేశారు. టెండర్లు సైతం పిలవడం, దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు వసతిగృహాల నిర్మాణానికి ప్లాన్‌లు సైతం పూర్తిచేశారు. కానీ ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో మరోసారి సోమవారం అదే పనికి శంకుస్థాపన పేరుతో మరో కొత్త శిలాఫలకాన్ని వేసి పూజలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పాటు తమ్మడపల్లె గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజీఎఫ్ క్రింద రూ. కోటి మంజూరు కాగా గత ఏడాది మహానంది ట్రస్ట్‌బోర్డు అప్పటి చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, దేవదాయశాఖ అధికారులు భూమిపూజ చేశారు. మళ్లీ మరోసారి సోమవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలు భూమి పూజలు చేయడం విశేషం.

ప్రొటోకాల్ పాటించని మహానంది ఆలయ అధికారులు

మహానంది దేవస్థానంలో సోమవారం జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎలాంటి ఆహ్వానం లేదని, కనీసం ఫోన్ ద్వారా సమాచారం అందించలేదని మహానంది మండల జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మహానంది సర్పంచ్ చలం చలం శిరీష, ఎంపీటీసీ సభ్యుడు బంగి వెంకటేశ్వర్లులను సైతం పిలవకపోవడం అధికారుల ఏకపక్ష తీరుకు అద్దం పడుతుందని విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు 'షైనింగ్' అవార్డులు

కర్నూలు సిటీ: నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో పది, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుకు షైనింగ్ స్టార్స్ పేరుతో సోమవారం ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చే వారు కావాలన్నారు. ఆ తరువాత పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి. నవ్య, డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.



అవార్డులను అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరుచరిత, జేసీ, డీఈఓలు



కుర్చీలను ఎత్తుతున్న తల్లిదండ్రులు

అస్తవ్యస్తం

- కార్యక్రమంలో కుర్చీలు వేసేందుకు సిబ్బంది లేరు. దీంతో కొంత మంది తల్లిదండ్రులు, విద్యార్థులే కుర్చీలు వేసుకోవాల్సి వచ్చింది.
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భోజనాలకు కొంత మంది విద్యార్థులకే టోకన్లు ఇచ్చారు. టోకన్లు అందకపోవడంతో కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.
- ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించినా షైనింగ్ స్టార్స్ ఇవ్వలేకపోయారు. కొన్ని చోట్ల ఎంపికలో కచ్చితమైన నిబంధనలను పాటించకపోవడంతో పేదింటి బిడ్డలు షైనింగ్ స్టార్స్ కాలేకపోయారు.

శ్మశానవాటిక కోసం ఉద్యమబాట

- రెండువేల మందితో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెట్నిహాళ్లి గ్రామస్తులు

మంత్రాలయం: శ్మశాన వాటిక కోసం మంత్రాలయం మండలం చెట్నిహళ్లి గ్రామస్తులు ఉద్యమబాట పట్టారు. గ్రామంలోని రెండువేల మంది సోమవారం ఊరి పొలిమేరలోని అభయాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని అక్కడి నుంచి 167 జాతీయ రహదారిపై 3 కి.మీ. మీర భారీ ర్యాలీ చేశారు. నినాదాలు చేస్తు పాదయాత్రగా మంత్రాలయం చేరుకున్నారు. మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్, శ్రీమఠం ప్రధాన ముఖద్వారం మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ వెంటనే బందోబస్తు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు గంగుల మల్లికార్జున, అనుమేష్, తిక్కస్వామి డిమాండ్లతో కూడిన వినతిని తహసీల్దార్ రవికి అందజేశారు. భారీ ర్యాలీ కారణంగా మంత్రాలయంలో మూడు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోగా రాకపోకలు స్తంభించిపోయాయి.

రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలి

వీహెచ్‌పీ ఆదోని డివిజన్ కార్యదర్శి హనుమంతరెడ్డి, జిల్లా ప్రచార ప్రముఖ్ ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ.. 400 ఏళ్లుగా ఉన్న శ్మశానంలో అంత్యక్రియలు చేయకుండా అడ్డుపడటం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి శ్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆందోళనలో వీహెచ్‌పీ కార్యదర్శులు, ప్రముఖ్‌లు శ్రీరంగ, రవికుమార్, జగదీష్, గోవర్ధన్ నాయుడు, రాజశేఖర్‌స్వామి, గువ్వల నారాయణ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

'అడ్వెంచర్' అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): టెంజింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్–2024 అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహస క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వారికి జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి సంవత్సరం రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తున్నారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ.15లక్షల నగదు బహుమతిని ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ అవార్డుకు https://awards.gov.in ద్వారా ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

11న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): బి. క్యాంపు బాలికల క్రీడా మైదానంలో ఈనెల 11న జిల్లా స్థాయి మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీల్లో ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ. 300 చెల్లించాలని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకానికి రెండు మండలాల ఎంపిక

శ్రీశైలంప్రాజెక్ట్: కేంద్ర ప్రభుత్వ పథకమైన ధర్తీ ఆబ జంతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకానికి జిల్లాలోని ఆత్మకూరు, బనగానపల్లె మండలాలు ఎంపికైనట్లు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కేవీ శివప్రసాద్ సోమవారం తెలిపారు. గిరిజన గూడేలలో పిల్లలకు నాణ్యమైన విద్య, గిరిజనుల ఆరోగ్య సంరక్షణ, గూడేలలో మౌలిక సదుపాయాల కల్పన, గిరిజన సంస్కృతి, కళలను కాపాడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆత్మకూరు మండలంలోని బైర్లూటీ, బనగానపల్లె మండలంలోని రాళ్లకొత్తూరు, గుల్లమలియా బాయి తండాలు ఎన్నికైనట్లు పీఓ తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆయా గూడేల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు.

యువకుల నిజాయితీ

- రోడ్డు మీద లభించిన బ్యాగు పోలీసులకు అప్పగింత



బంగారం, నగదును అప్పగిస్తున్న ఎస్ఐ

ఎమ్మిగనూరురూరల్: రోడ్డు మీద లభించిన బ్యాగులో రూ. లక్షల డబ్బులు ఉన్నాయి.. విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి... అయినా యువకులు నిజాయితీ చాటుకున్నారు. పోలీసులకు బ్యాగ్‌ను ఇచ్చి బాధితులకు అందేలా చేశారు. బ్యాగ్ తెచ్చిన యువకులకు పోలీసులు అభినందించారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండల పరిధిలోని బోడబండ గ్రామం సమీపంలో సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో రోడ్డుపై బ్యాగ్‌పడి ఉండటంతో సోహెల్, అతని స్నేహితుడు వలి, పెద్దకబుదూరు నరసింహులు తీసుకున్నారు. నేరుగా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు బ్యాగ్‌ను తీసి చూశారు. అందులో రెండు గోల్డ్ బిస్కెట్స్ 22 గ్రాములు, నల్లపూసల బంగారు దండ 31 గ్రాములు, రెండు పోరుల బంగారు దండ 18 గ్రాములు, 18 గ్రాముల నక్లెస్, 3 గ్రాముల చెవి చుట్టు, 16 గ్రాముల బ్రాస్‌లైట్, 10 గ్రాముల ఒక జత కమ్మలు, 120 గ్రాములు వెండి చైనులు, రూ.2.50 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఇంతలో నందవరం మండలానికి చెందిన కురవ లలిత, చంద్రగుప్తలు ఆదోని బైక్‌పై వెళ్తేంటే తమ బ్యాగ్ పోయిందని పోలీసులుకు ఫిర్యాదు చేశారు. వారికి సమాచారం అందించి, పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నగదు, బంగారు, వెండి వస్తువులను అప్పగించారు.

పెద్దమ్మ దేవరలో విషాదం

- విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన ఉష(ఫైల్)

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ దేవరలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందగా మరో ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు...దొర్నిపాడుకు చెందిన బోయ బాల ఉసేని భార్య ఉష మూల పెద్దమ్మ దర్శనం కోసం డబ్ల్యూ గోవిందిన్నెకు సోమవారం తెల్లవారుజామున చేరుకుంది. దర్శనం కోసం వెళ్తుండగా క్యూలైన్ల వద్ద స్తంభాన్ని తాకడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయింది. ఆమె పక్కన మరో ముగ్గురు మహిళలు కూడా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించగా అప్పటికే ఉష మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్

బొమ్మలసత్రం: పాణ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ మందాజావళి ఆల్ఫోన్స్ తెలిపారు. సోమవారం స్థానిక సీసీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కోనసీమ జిల్లాకు చెందిన కట్టా శివశంకర్, రాజమహేంద్రవరం జిల్లాకు చెందిన వెంకటేశ్వరావును గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో 40కి పైగా చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. వారి నుంచి పావు కేజీ బంగారు ఆభరణాలు, కేజీ వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. దొంగల అరెస్ట్‌లో ప్రతిభ చూపిన సీఐలు సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి సిబ్బందిని అభినందించారు.

బడికి వెళ్లకుండా మృత్యు ఒడికి!

అక్షరాలను అందంగా రాయాల్సిన చేతులవి..
పద్యాలను మధురంగా ఆలపించాల్సిన గొంతు అది...
ఖోఖో.. క్రికెట్.. అంటూ తాండవం చేయాల్సిన వయస్సు..
'విధి' పగబట్టడంతో బడికి వెళ్లకుండా పనిబాట పట్టాల్సి వచ్చింది..
ప్రపంచాన్ని చూపే నాన్న ఐదేళ్ల క్రితం మృతి చెందగా..
బాల్యంలో శ్రమైక జీవనమే సౌందర్యం అనిపించింది..
అమ్మకు అండగా ఉండాల్సిన ఆ బాలుడు
నేడు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు.



మృతి చెందిన దొరబాబు

- ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు
- కారుమంచి గ్రామంలో విషాదం



ట్రాక్టర్ కింద బాలుడి మృతదేహం

ఆస్పరి: ట్రాక్టర్ కింద పడి దొరబాబు (12) అనే బాలుడు సోమవారం మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఆస్పరి మండలంలోని కారుమంచి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్ఐ మన్మధ విజయ్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ క్రిష్ణ, రాధ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరకు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలోనే బోయ క్రిష్ణ మృతి చెందాడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ తల్లి రాధ.. కుమార్తెను, ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఇటీవల కుమార్తెకు వివాహం చేసింది. వీరికి కేవలం రెండు ఎకరాల పొలం ఉంది. కుమారుడు దొరబాబు (12) బడికిపోకుండా కూలి పనులు చేస్తూ అమ్మకు తోడుగా ఉన్నాడు. సోమవారం చిన్నాన్న వెంకటేష్ ట్రాక్టర్‌తో గరుసు తోలుతుండగా బాలుడు దొరబాబు వెళ్లాడు. కొండలో నుంచి ట్రాక్టర్‌లో గరుసు వేసుకున్న తరువాత బాలుడు ట్రాలీపై ఉన్న గరుసుపై కూర్చున్నాడు. గ్రామంలోకి వచ్చిన తరువాత ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో బాలుడు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అనుకోని సంఘటన జరగడంతో బాలుడు తల్లి, కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.